RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 319 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 22 మే 2024 పేజీలు : 4 వెల : 2/-



## తెలంగాణలో హోరాహోరీగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

# గెలుపు ప్రతిష్టాత్మకం

## కాంగ్రెస్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల విస్తృత ప్రచారం

## బీజేపీ తరపున కిషన్ రెడ్డి, ఇతర నాయకులు

## బీఆర్ఎస్?లో చెమటోడుస్తున్న కేటీఆర్, హరీశ్ రావు

హైదరాబాద్ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో సత్తా చాటేందుకు మూడు ప్రధాన పార్టీలు హెూరాహెూరీగా ప్రచారం సాగిస్తున్నాయి. ఖమ్మం-నల్గొండ-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బై పోల్ ఈ నెల 27న జరగనుండగా, 25తో ప్రచారం ముగియనుంది. గెలుపును మూడు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. విద్యావంతులు, బుద్ధిజీవుల్లో తమకు పట్టు ఉందని నిరూపించుకునేందుకు పార్టీలు పోటీపడ్తున్నాయి. ఈ క్రమంలో మూడు పార్టీల నేతలు ప్రత్యర్థులపై చేస్తున్న విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

**బరిలో ఇద్దరు పాతోళ్లు :** ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలవడంతో ఈ ఉప ఎన్నిక జరుగుతున్నది. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు పూర్తికావడంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టిపెట్టాయి. కాంగ్రెస్ తరఫున చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి రాకేశ్ రెడ్డి పోటీపడుతున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పల్లాతో పాటు తీన్మార్ మల్లన్న, ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. అప్పుడు ఇండిపెండెంట్ గా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న ఇప్పుడు కాంగ్రెస్ తరఫున, గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసిన ప్రేమేందర్ రెడ్డి ఇప్పుడు కూడా అదే పార్టీ నుంచి బరిలో నిలిచారు. బీఆర్ఎస్ నుంచి పల్లా స్థానంలో రాకేశ్ రెడ్డి పోటీ చేస్తున్నారు. పలువురు విద్యావేత్తలు ఇండిపెండెంట్లుగా బరిలో నిలిచినా, ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థుల నడుమే త్రిముఖ పోటీ కొనసాగే అవకాశం కనిపిస్తున్నది.

**నిరుద్యోగులే లక్ష్యంగా ప్రచారం..** మూడు పార్టీల నేతలు నిరుద్యోగులే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మంత్రులు ఉత్తమ్?కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్కలతో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు రంగంలోకి దిగారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ ను గెలిపించాలని కోరుతున్నారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ఆడుకుందని, ఎన్నికల ముందు అరకొర నోటిఫికేషన్లు వేసి, పేపర్ లీకేజీలతో ఆగం చేసిందని గుర్తుచేస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 30వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, రానున్న రోజుల్లో మిగిలిన 1.70లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇస్తోంది. ఉద్యోగులకు సైతం ప్రతి నెలా ఫస్ట్ తారీఖునే జీతాలు ఇస్తున్నామని చెప్తూ ఓట్లు అడుగుతోంది. అటు ఈ ఎమ్మెల్సీని కాంగ్రెస్ ఖాతాలో వేసేందుకు సీఎం రేవంత్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో రేవంత్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ గెలుపు కోసం దిశానిర్దేశం చేస్తున్నారు. బీజేపీ తరఫున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇతర నేతలు ఆయా జిల్లాల్లో పర్యటిస్తూ.. గ్రాడ్యుయేట్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో మోదీని ఆదరిస్తున్నట్లే ఈ ఎన్నికల్లో కూడా కమలానికి ఓటు వేయాలని కోరుతున్నారు. నిరుద్యోగులను, ఉద్యోగులను రెండు పార్టీలు మోసగించాయని చెప్తున్నారు. ఇక బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును తిరిగి దక్కించుకునేందుకు ఆ పార్టీ తరఫున మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రంగలోకి దిగారు. ఆయా జిల్లాల్లోని ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలను పట్టుకొని పట్టభద్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాము పదేండ్ల కాలంలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, కానీ ఆ విషయాన్ని చెప్పుకోలేకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని ప్రచారం చేస్తున్నారు. అయితే గ్రాడ్యుయేట్లు ఎటువైపు మొగ్గు చూపుతారనేది తేలాలంటే వచ్చే నెల 5 వరకు ఆగాల్సిందే!

# కంటోన్మెంట్ ఉప ఎన్నిక : విజయం ఎవరిని వరిస్తుందో..?

హైదరాబాద్ : లోక్ సభ ఎన్నికలతోపాటు తెలంగాణలో జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నిక గురించి పెద్దగా చర్చే లేకుండా పోయింది. పార్లమెంట్ ఎన్నికల హడావిడే ఇందుకు ప్రధాన కారణం. మల్కాజ్ గిరి లోక్ సభతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి కూడా ఉప ఎన్నిక జరిగింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ తరఫున దివంగత ఎమ్మెల్యే సోదరి నివేదిత పోటీలో ఉండగా గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీ గణేష్ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బీజేపీ తరఫున టి.ఎన్. వంశ తిలక్ పోటీ చేశారు.

ఈ ఉప ఎన్నికల్లో గెలిచి గ్రేటర్ లో సొంతంగా ఖాతా తెరవాలని కాంగ్రెస్ పట్టుదలతో కనిపించగా గ్రేటర్ లో బీఆర్ఎస్ పట్టు సడలలేదని నిరూపించుకునేందుకు ఈ బైపోల్ లో ఎలాగైనా




నెగ్గాలని బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇక్కడ నెగ్గి అసెంబ్లీలో సంఖ్యా బలం పెంచుకోవాలని బీజేపీ కూడా గట్టి ప్రయత్నమే చేసింది. అయితే, ఈ ఉప ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనేది గ్రేటర్ పరిధిలో ఉత్కంఠ నెలకొంది. సాయన్న చేసిన అభివృద్ధితో పాటు సానుభూతి ఓట్లు బీఆర్ఎస్ ను గట్టెక్కిస్తాయని గులాబీ క్యాడర్ లో చర్చ జరుగుతుండగా అధికార పార్టీ అండదండలు, కంటోన్మెంట్ పరిధిలో పలు సమస్యలకు రేవంత్ పరిష్కారం చూపడంతో ఓటర్లు హస్తం పార్టీని ఆశీర్వదిస్తారని అంచనా వేస్తోంది. బీజేపీ అభ్యర్థి తిలక్ మాత్రం మోడీ చరిష్మా, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటేసిన వాళ్ళు పార్లమెంట్ ఎన్నికల్లో మోడీని బలపరచాలని ఫిక్స్ అయి, బీజేపీకి ఓటేసి ఉంటారని లెక్కలు వేస్తున్నారు. ఇలా ఎవరి లెక్కలతో వాళ్ళు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయంపై ధీమాగా ఉన్నారు. కంటోన్మెంట్ లో విజయం ఎవరిని వరిస్తుందో జూన్ 4న తేలనుంది.

# ఇన్‌ఛార్జ్ వీసీలు వచ్చేశారు..

## ఓయూ, కేయూల వీసీలు ఎవరంటే?

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జి వీసీలను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంచార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లను ప్రభుత్వం వెల్లడించింది.

**ఇన్‌ఛార్జ్ వీసీల జాబితా ఇదే..** 1.ఉస్మానియా యూనివర్సిటీ – దాన కిషోర్ 2. జేఎన్టీయూ – బుర్ర వెంకటేశం 3. కాకతీయ – కరుణ వాకాటి 4. అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ – రిజ్వి 5. తెలంగాణ వర్సిటీ – సందీప్ సుల్తానియా 6. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ – శైలజ రామయ్యర్ 7. మహాత్మా గాంధీ యూనివర్సిటీ – నవీన్ మిట్టల్ 8. శాతవాహన యూనివర్సిటీ – సురేంద్ర మోహన్ 9. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీ – జయేష్ రంజన్ 10. పాలమూరు యూనివర్సిటీ – నదీం అహ్మద్.

# పారిశ్రామిక అభివృద్ధికి కొత్తగా ఆరు పాలసీలు..

## సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు



హైదరాబాద్: పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడేలా విధానాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు సంబంధించి మంగళవారం అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై పలు సూచనలు చేశారు. గత సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, పనుల్లో పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. టెక్స్ టైల్స్‌కు సంబంధించి రాష్ట్రంలోని పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగపడేలా కొత్త పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఆరు పాలసీలను రూపొందించనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీ, ఎక్స్ పోర్ట్ పాలసీ, న్యూ లైఫ్ సైన్సెస్ పాలసీ, రివైజ్డ్ ఈవీ పాలసీ, మెడికల్ టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తున్నామని సీఎంకు వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసేలోగా పారిశ్రామిక పాలసీలను పూర్తిస్థాయిలో రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రపంచ దేశాల్లో ది బెస్ట్ పాలసీలను అధ్యయనం చేయాలని సూచించారు.




# ఓట్ల నాడు ఒక మాట.. నాట్ల నాడు మరో మాట చెప్పడమే కాంగ్రెస్ నైజం: కేటీఆర్

హైదరాబాద్: ఎన్నికల హామీకి భిన్నంగా సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. ఇది కపట కాంగ్రెస్ మార్కు మోసమని, దగా, నయవంచన అని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్యారెంటీ కార్డులో వరిపంటకు రూ.500 బోనస్ అని ప్రకటించి.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కుతారా అంటూ ప్రశ్నించారు. ప్రచారంలో ప్రతి గింజకు అని ఊదరగొట్టి.. ప్రభుత్వంలోకి రాగానే చేతులెత్తేస్తారా అని నిలదీశారు. ఇది ప్రజా పాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన అని సామాజిక మాధ్యం ఎక్స్ వేదికగా విమర్శించారు. 'నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారు, కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారు, కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారు. ప్రతి ఏటా రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు రైతుభరోసా అన్నారు.. ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అన్నారు.. కానీ వేయలేదు. ప్రతి రైతుకు డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు.. చేయలేదు. నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయటపెట్టారు. ఓట్ల నాడు ఒకమాట.. నాట్ల నాడు మరోమాట చెప్పడమే కాంగ్రెస్ నైజం. అసెంబ్లీ ఎన్నికల్లో గాలిమాటలతో గారడీ చేసింది కాంగ్రెస్ పార్టీ. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడగానే నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా తన నిజస్వరూపాన్ని బయటపెట్టింది.. కాంగ్రెస్ సర్కారు. ఎద్దేడ్చిన యవుసం, రైతేడ్చిన రాజ్యం నిలబడదు. నమ్మి ఓటేసినందుకు.. రైతుల గొంతు కోసిన కాంగ్రెస్ సర్కారును అన్నదాతలు ఇక వదిలిపెట్టరు. పల్లె పల్లెనా ప్రశ్నిస్తారు, తెలంగాణ వ్యాప్తంగా నిలదీస్తారు, కపట కాంగ్రెస్‌పై సమరశంఖం పూరిస్తారు. నేటి నుంచి రైతన్నల చేతిలోనే కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ షురూ' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.




# సన్న బియ్యానికే రూ.500 బోనస్ అనలేదు...

హైదరాబాద్: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో వరి కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధాన్యం తడిసినా, చివరకు మొలకెత్తిన గింజలు కూడా కొంటామని వెల్లడించారు. రేటు తగ్గించకుండా కొంటామని అన్నారు. దీంతోపాటు వరి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుమని చెప్పారు. ఈ అంశం ప్రతిపక్షాలకు రుచించడం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. రైతులను ఇబ్బంది పెట్టేందుకు రాజకీయాలను వాడొద్దని ప్రతిపక్షాలకు డిప్యూటీ సీఎం హితవు పలికారు. రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయడం లేదు, కల్లాల్లలోనే ధాన్యం తడిసి ముద్దౌతుందని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. అందులో నిజం లేదని చెప్పారు. గత ఏడాది ఇదే సమయంలో తాను పాదయాత్ర చేస్తుండగా రోడ్ల వెంట ధాన్యం కుప్పలుగా పోసి రైతులు ఇబ్బంది పడేవారని భట్టి గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం గత ప్రభుత్వం కంటే 15 రోజులు ముందుగానే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ మాదిరిగా కాకుండా మీకంటే ఎక్కువ కేంద్రాల్లో 7,245 కొనుగోళ్లను ప్రారంభినట్లు స్పష్టం చేశారు. ఎన్ని టన్నుల ధాన్యం పండినా కూడా కొంటామని స్పష్టం చేశారు. ఇక ధాన్యం బోనస్ విషయానికి వస్తే సన్న బియ్యానికే రూ. 500 బోనస్ అనలేదని, సన్నాలతో 500 రూపాయల బోనస్ ప్రక్రియను మొదలు పెట్టామని చెప్పారు. నాటి సీఎం కేసీఆర్ వరి వేస్తే ఉరే అని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న రైతు అనుకూల నిర్ణయాలు ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదని భట్టి అన్నారు. రైతుల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెరగడంతో ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా తప్పుడు సమాచారం ప్రజల్లోకి తీసుకెళ్లవద్దని కోరారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## రాయబరేలీ రాహుల్ కి జై కొట్టిందా ?

దేశంలో లోక్ సభ ఎన్నికలలో భాగంగా అయిదవ విడత పోలింగ్ సోమవారం సాయంత్రం తో ముగిసింది. మొత్తం 49 లోక్ సభ సీట్లకు పోలింగ్ జరిగితే అందులో అందరి దృష్టిని ఆకట్టుకునే సీట్లు రెండు ఉన్నాయి. అవి అమేధీ రాయబరేలీ. ఈ రెండు సీట్లలో బాగానే పోలింగ్ సాగింది. అమేధీలో 2004 నుంచి వరసగా పోటీ చేస్తూ వస్తున్న రాహుల్ 2019లో ఓటమి పాలు అయ్యాక 2024 ఎన్నికలలో వదిలేసారు. దానికి గాంధీ కుటుంబానికి అత్యంత విధేయుడు అయిన కిశోర్ లాల్ శర్మ అనే నేతలు ఇచ్చారు. ఆయన ఈసారి ఎంపీగా అక్కడ పోటీ చేస్తూంటే బీజేపీ నుంచి కేంద్రం మంత్రి స్మృతి ఇరానీ వరసగా మరోసారి పోటీ చేస్తున్నారు. ఆమె తన విజయం మీద పూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత సారి రాహుల్ గాంధీనే ఓడించిన స్మృతి ఇరానీ తనకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి శర్మ లెక్క కాదు అన్నట్లుగా ఆమె ఆత్మ విశ్వాసం ఉంది. అక్కడ ఏమి జరుగుతుంది అన్నది పక్కన పెడితే రాయబరేలీ కాంగ్రెస్ కి కంచుకోట లాంటి మరో సీటు. ఇక్కడ కూడా 2004 నుంచి 2019 దాకా నాలుగు సార్లు ఎంపీగా సోనియా గాంధీ గెలిచారు. ఆమె ఈసారి రాజ్యసభకు వెళ్లడం ద్వారా ఆ సీటు ఖాళీ చేస్తే అందులోకి రాహుల్ వచ్చారు. నిజానికి ఇక్కడ నుంచి ప్రియాంకా గాంధీ పోటీ చేస్తుంది అని అంతా అనుకున్నారు. కానీ రాహుల్ బరిలోకి దిగారు. మరి ఈ సీటులో రాహుల్ ప్రచారం పెద్దగా చేయలేదు. నామినేషన్ దాఖలు చేసిన తరువాత తల్లి సోనియాతో కలసి భారీ సభ నిర్వహించి ఆ మీదట ఇతర ప్రాంతాలలో ప్రచారం చేశారు. చెల్లెలు ప్రియాంక మాత్రం పనిగట్టుకుని అక్కడే ఉన్నారు. తన అన్న గెలుపు కోసం అవిశ్రాంతం పనిచేశారు. ఇదిలా ఉంటే తన కుమారుడిని రాయబరేలీ ప్రజల చేతులలో పెడుతున్నాను ఆశీర్వదించాలని సోనియా గాంధీ సెంటిమెంట్ తో కూడిన ప్రసంగం చేశారు. దానిని బీజేపీ నేతలు గట్టిగానే తిప్పుకొట్టారు. ఈ సీటు మీ కుటుంబానికి రాసిచ్చేశారా అని ఫైర్ అయ్యారు. కరోనా టైం లో రాయబరేలీ అసలు రాని సోనియా ప్రజలకు చేసిన సేవ ఏమిటి అని కూడా వారు ప్రశ్నించారు. సోనియా తరువాత అక్కడ ఎంపీగా పోటీ చేయడానికి అర్హుడైన నేత ఎవరూ లేరా అని నిలదీశారు. వారసత్వ రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని కూడా బీజేపీ నాయకులు పిలుపు ఇచ్చారు. రాయబరేలీలో చూస్తే 2004 తరువాత నుంచి వరసగా సోనియా గాంధీ మెజారిటీ తగ్గుతూ వస్తోంది. ఆమె 2004లో పోటీ చేసినపుడు 249,765గా వచ్చింది. 2009లో అది కాస్తా ఏకంగా 372,165కు ఎగబాకింది. అయితే 2014కి వచ్చేటప్పటికి 352,713కి తగ్గింది. 2019 ఎన్నికల నాటికి చూస్తే ఏకంగా సగానికి పడిపోయి 167,178 మెజారిటీ మాత్రమే సోనియా గాంధీకు దక్కింది. ఇక సోనియా గాంధీ మెజారిటీని సగానికి సగం తగ్గించడానికి ఆమె ప్రత్యర్థిగా 2019 ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ సీనియర్ నేత దినేష్ ప్రతాప్ సింగ్ కారణం. ఆనాడే ఆయన గెలవాలని బీజేపీ నేతలు అంటున్నారు. ఇపుడు సోనియా గాంధీ పోటీ నుంచి తప్పుకుని రాహుల్ గాంధీ పోటీకి దిగారు. పైగా ఆయన కేరళలోని వయనాడ్ నుంచి కూడా పోటీ చేస్తున్నారు. దాంతో ఆయన గెలిస్తే ఈ సీటు వదులుకుంటారు అన్న ప్రచారం కూడా బీజేపీ చేసింది. ఇక బీజేపీ ఎంపీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్ కి సానుభూతి ఉంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే ఎస్పీ కాంగ్రెస్ కాంబినేషన్ తో రాయబరేలీ మళ్లీ కాంగ్రెస్ సొంతం అవుతుందని అంటున్నారు. ప్రియాంకా గాంధీ చేసిన ప్రచారం కూడా జనంలో చర్చకు వచ్చింది అని అంటున్నారు. పోలింగ్ సరళి చూస్తే తమకు అనుకూలం అని కాంగ్రెస్ బీజేపీ రెండు చెబుతున్నాయి కానీ రాయబరేలీ ఓటర్లు ఎవరిని గెలిపించబోతున్నారు అన్నది తెలియాలంటే జూన్ 4 వరకూ వేచి చూడా ల్సిందే. ఈసారి అమేధీ కంటే కూడా రాయబరేలీవే టాక్ ఆఫ్ ది పార్లమెంట్ సీటు గా మారబోతోంది అని అంటున్నారు. రాహుల్ తాత నాన్నమ్మ, తల్లి ప్రా తినిధ్యం వహించిన సీటు నుంచి ఎంపీ అయి వారసత్వం కొనసాగిస్తారా లేదా అన్నదే హాట్ టాపిక్ గా ఉంది.

# సర్కారు బడుల్లో సౌకర్యాలు



సారంగాపూర్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మన ఊరు-మన బడిలో భాగంగా పాఠశాలల్లో గతంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. మిగిలిపోయిన పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో ప్రణాళికలు తయారు చేశారు. ఇందుకు జిల్లాలోని 788 ప్రభుత్వ పాఠశాలల్లో 4002 పనులు గుర్తించి రూ.31.49 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇందులో అవసరమైన మౌలిక వసతులు, బాలికల మూత్రశాలల నిర్మాణాలు, తాగునీటి అవసరాలు, మైనర్, మేజర్ మరమ్మతు పనులు, నిరుపయోగంగా ఉన్న మూత్రశాలల పునరుద్ధరణ, పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఇతర పనులు, సౌరశక్తి విద్యుత్తు పరికరాలు ఏర్పాటు, పాఠశాల యూనిఫాంల తయారీపై వ్యయం చేయనున్నారు. మూతబడ్డ పాఠశాలలను తిరిగి ప్రారంభిస్తామని గతంలో ప్రభుత్వం పేర్కొనగా ఆయా పాఠశాలలతోపాటు, ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఇప్పటికే పనులు ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యం జరిగింది. ఇప్పటికైనా పనులు ప్రారంభిస్తే పాఠశాలల పునఃప్రారంభానికి ముందే మౌలిక వసతులు సమకూరనున్నాయి.

రూ.31.49 కోట్లతో..

జిల్లాలో 788 ప్రభుత్వ పాఠశాలల్లో 4002 పనులు గుర్తించారు. ఇందులో మూత్రశాలల మరమ్మతుకు రూ.6.36 కోట్లు, తాగునీటి కోసం రూ.7.24 కోట్లు, చిన్నచిన్న మరమ్మతులు రూ.9.22 కోట్లతో చేపట్టనున్నారు. పట్టణ పాఠశాలల్లో బాలికల మూత్రశాలల నిర్మాణానికి రూ.1.99 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.4.65 కోట్లతో చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరి, ఇబ్బందులు తొలగనున్నాయి.

ఆదర్శ కమిటీల ద్వారా పర్యవేక్షణ

గ్రామాల్లో స్వశక్తి సంఘాల్లోని మహిళలను ఆదర్శ కమిటీల్లో సభ్యులుగా చేర్చారు. ఆయా పనులను ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపడుతుండగా ఆదర్శ కమిటీలు పర్యవేక్షించనున్నాయి. పనులు ప్రారంభమైన తరువాత నిధులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడితోపాటు మహిళా సమాఖ్య అధ్యక్షురాలితో కలిసి బ్యాంకు నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. రూ.25 వేల లోపు విలువైన పనులు పూర్తి చేసిన తరువాత పాఠశాలల్లో కమిటీ సమావేశమై నిధులు విడుదల చేయాల్సి ఉండగా, రూ.లక్షలోపు ఎంపీడీవో అనుమతి, అపై నిధుల విడుదలకు కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆదర్శ కమిటీ నియామకాలు పూర్తి కాగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పనులు ప్రారంభించేలా చర్యలుపాఠశాలల్లో మౌలిక వసతులు సమకూర్చేందుకు ఇప్పటికే ప్రణాళికలు తయారు చేశారు. ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పనులు పూర్తయితే పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు సమకూరనున్నాయి.- భీమయ్య, ఎంఈవో

# ప్రచారం ఎక్కువ.. ఆదాయం తక్కువ



కరీంనగర్ : జిల్లాలోని నగర, పురపాలికల పరిధిలో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి పన్నులు, ఇతర రకాల ఫీజులు వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. భవన అనుమతులతోపాటు ప్రకటనల ద్వారా భారీగా ఆదాయం వస్తోంది. కొన్నింటికి అనుమతులు తీసుకొని, ఎక్కువ శాతం అనధికారికంగా ఏర్పాటు చేస్తున్నారు. అలాంటి ప్రకటనల బోర్డులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో బల్దియాల ఆదాయానికి గండి పడుతుండగా.. ఉచితంగా ప్రచారం చేసుకుంటూ కొందరు నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఉన్న హోర్డింగ్‌లతోపాటు కొత్తగా కొన్ని రోడ్డు మధ్యన బోర్డులు బిగించారు. వీటికి అనుమతులు తీసుకుంటుండగా రోడ్డు పక్కన ఉన్న బోర్డుల విషయంలోనే పట్టింపు లేకుండా పోతుంది.

అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు

నగరంతోపాటు పట్టణాల్లో వ్యాపార, వాణిజ్య పరమైన ప్రచారానికి ప్రకటనలు తప్పనిసరి. అలాంటి వాటికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. రద్దీ ప్రాంతాల్లో ప్రజల దృష్టిని ఆకర్షించేలా ఈ ప్రచారబోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటిని ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేయడానికి వీల్లేకుండా పురపాలక చట్టం-2020 ప్రకారం నిబంధనలు విధించింది. 15 రకాల ప్రకటనల కోసం బల్దియా నుంచి అనుమతి తీసుకునే వీలుంది. వివాదాస్పద స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జల వనరులు వంటి కొన్నింటికి ప్రైవేటు ప్రకటనలు నిషేధం. మిగతా చోట్ల ఏర్పాటు చేసుకోవడానికి ఆన్‌లైన్ ద్వారా కమిషనర్ అనుమతి ఇస్తే తప్ప ప్రకటనల ద్వారా ప్రచారం చేసుకోవడానికి వీల్లేదు. పెద్ద పెద్ద హోర్డింగ్‌లు తప్ప మిగతా చోట్ల ఏర్పాటు చేసే ప్రకటనలకు అనుమతులు ఉండటం లేదు. అనుమతులు లేకపోతే సదరు సంస్థపై రోజుకు రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించే వీలుంది.

అర్జీలు నామమాత్రం

ప్రకటనల బోర్డులు ఇబ్బడిముబ్బడిగా ఉండగా, దరఖాస్తులు మాత్రం తక్కువగానే ఉంటున్నాయి. ఆన్‌లైన్ లెక్కల ప్రకారం గత మూడేళ్లుగా వచ్చిన అర్జీలు, అనుమతులు నామమాత్రంగా ఉన్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ ఏటా రూ.2.73 కోట్లు ఆదాయం మాత్రమే వచ్చినట్లుగా బడ్జెట్‌లో చూపించారు. వచ్చే ఏడాదికి అదనంగా మరో రూ.27 లక్షలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. మొత్తానికి ప్రచార ప్రకటనల బోర్డుల ద్వారా ఆదాయం పెంచుకునేలా అధికారులు కసరత్తు చేయాల్సిన అవసరముంది.


హోర్డింగ్‌లు భద్రమేనా? ఇటీవల ముంబయి నగరంలో ఈదురుగాలులు, భారీ వర్షాలకు ఈనెల 13న భారీ హోర్డింగ్ నేలకూలడంతో 16 మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. సంబంధిత బోర్డు ఏర్పాటుకు అనుమతి తీసుకోలేదని అక్కడి అధికారులు ప్రకటించారు. ఈ ప్రమాదంతో అందరి దృష్టి హోర్డింగ్‌లపై పడింది. అలాంటి ప్రమాదాలు కరీంనగర్‌లో కూడా పొంచి ఉన్నాయి. నగరవ్యాప్తంగా హోర్డింగ్‌లు, క్యాంట్రీలివర్స్, లాలీపాప్స్, యూనిపోల్స్, ఇతర ప్రకటనల బోర్డులు ఉన్నాయి. వీటి నిర్వహణ ప్రైవేటు యాడ్ ఏజెన్సీలదే. నిబంధనల ప్రకారం ప్రతి హోర్డింగ్ భద్రతను ఏడాదికొకసారి సివిల్ ఇంజినీర్లతో పరిశీలన చేయించాలి. రెన్యువల్ చేసుకునే సమయంలో స్ట్రక్చర్ స్టెబిలిటి సర్టిఫికెట్ సమర్పించాలి. ఆ సర్టిఫికెట్ ఉందా? లేదా? అనే విషయం తెలియకపోగా, క్షేత్రస్థాయిలో అనుమతి ఉందో ఇప్పటికీ లెక్క మాత్రం తేల్చడం లేదు.

# పరిశ్రమలతో ప్రగతి!

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంక్ లింకేజీ రుణాలతో ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. రుణాలు తీసుకోవడంతోపాటు తిరిగి వాయిదాలు చెల్లించడంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు సంఘ సభ్యులందరికి కలిసి రుణాలు ఇస్తుండగా కొందరు మహిళలు ఖర్చు చేసే విధానంతో వారు పూర్తిస్థాయి లాభాన్ని పొందలేకపోతున్నారు. ఫలితంగా ఆశించిన ఆర్థికాభ్యున్నతి కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఒక్కో సభ్యురాలికి వ్యక్తిగతంగా చిన్నతరహా పరిశ్రమలతో లబ్ధి చేకూరేవిధంగా ప్రోత్సహించాలని సంకల్పించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ లక్ష్యం ఖరారైంది. ఈ సారి తొలిసారిగా ఔత్సాహిక పరిశ్రమలను స్థాపించేందుకు రుణాలు కేటాయించారు.

40,664 సంఘాలు..రూ. 2,548.84 కోట్లు

స్వశక్తి సంఘాల్లోని మహిళల కిరాణం, కంగన్‌హాల్, వస్త్ర దుకాణాలు, పిండి గిర్ని, బేకరి, విస్తారాకుల తయారీ, వస్త్ర, జనపనార, పుట్టగొడుగులు తయారీ, వ్యవసాయం, పిల్లల చదువులు, కుటీర పరిశ్రమలు నెలకొల్పుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. పొదుపు ఆధారంగా ఒక్కో సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల రుణం మంజూరు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 40,664 స్వశక్తి సంఘాలకు రూ.2,548.84 కోట్లు లక్ష్యం విధించారు. గతేడాది 36,996 సంఘాలకు రూ.2,116.85 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. గతేడాది కంటే రుణ లక్ష్యం పెరిగింది. ఈ ఏడాది లక్ష్యాలను



చేరుకునేందుకు ఆరంభం నుంచి ప్రణాళిక రూపొందిస్తున్నారు. గ్రామ స్థాయిలోని సీఏ మొదలుకొని సీసీలు, ఏపీఎం, డీపీఎంలతో పాటు జిల్లా అధికారులు పర్యవేక్షించనున్నారు.

ఔత్సాహిక మహిళలకు ప్రోత్సాహంబ్యాంకు రుణాలతో మరింత ఆర్థికంగా ఎదిగేందుకు ఈ ఏడాది వ్యక్తిగత రుణాలకు ప్రాధాన్యం కల్పించారు. జాతీయ జీవనోపాధుల మిషన్‌లో భాగంగా మహిళలను సొంతంగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేందుకు ఈసారి 'ఎంటర్‌ప్రైజెస్' రుణాలను అందిస్తున్నారు. ఈ రుణాలతో కొత్తగా పరిశ్రమలు స్థాపించడం, ఒకవేళ ఇప్పటికే ఏదైనా ఒక పరిశ్రమ ఉన్నట్లైతే మరింతగా ఆధునికీకరించేందుకు ప్రోత్సహించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5-10 లక్షలలోపు రుణం పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా 31,141 మహిళలకు రూ.622.78 కోట్లు మంజూరు చేయాలని నిర్ణయించారు.

# పరిశ్రమలు 900.. అధికారులు ఐదుగురు

చౌటుప్పల్ : రసాయన, ఇతర పరిశ్రమల నుంచి వచ్చే ప్రమాదకర వ్యర్థాలను జాగ్రత్తగా నిర్వీర్యం చేయాలి. ఎక్కడ పడితే అక్కడ పారబోస్తే భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. పరిశ్రమల పొగ గొట్టాల నుంచి గాఢమైన ఉద్గారాలు రాకుండా.. వాతవరణం, భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)ది. నిరంతరం తనిఖీలు చేస్తూ నిబంధనలను అతిక్రమించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. కానీ.. పీసీబీలో అధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పరిశ్రమల కాలుష్యంతో సతమతమవుతున్నామని బాధితులు నేరుగా ఫిర్యాదు చేసినా సమయానికి చేరుకోలేని దుస్థితి నెలకొంది. పీసీబీలో సిబ్బంది లేని అంశంపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్జీటీ) కూడా లేవనెత్తింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పీసీబీ పరిధిలోకి వచ్చే పరిశ్రమలు సుమారు 900 వరకు ఉన్నాయి. ఇందులో కాలుష్యాన్ని వెదజల్లే వాటిని బట్టి రెడ్, ఆరెంజ్, గ్రీన్ విభాగాల్లో చేరుస్తారు. ఇందులో రెడ్ జోన్ పరిధిలోకి వచ్చే రసాయన, సిమెంట్, క్వారీ, ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలే సగం వరకు ఉన్నాయి. ఇవన్నీ రాజధాని శివారులోని చౌటుప్పల్, చిట్యాల, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలైన మిర్యాలగూడ, దామరచర్ల, మేళ్లచెర్వు, మఠంపల్లి, నేరుడుచర్ల ప్రాంతాల్లో ఉన్నాయి.

రోజూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు..

యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పరిశ్రమలుంటే ప్రాంతీయ కార్యాలయం మాత్రం నల్గొండ జిల్లా కేంద్రంలోనే ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలో కలిపి రోజు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తాయి. వీటిని పరిష్కరించడానికి ఒక పీసీబీ ఈఈ, ఇద్దరు ఏఈలు, ఇద్దరు ఎనాలసిస్ట్‌లు మాత్రమే ఉన్నారు. పీసీబీ ఈఈ పర్యవేక్షణలోనే వీరంతా పని చేయాల్సి ఉంటుంది.

ఏటా పరిశ్రమలు పెరుగుతున్నా అధికారులు మాత్రం పెరగడం లేదు. ఫిర్యాదులు చేసినా అధికారులు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. విజయవాడ హైవేపై చౌటుప్పల్ శివారులోని తుప్రాన్‌పేట నుంచి కోదాడ శివారు దాకా సుమారు 150 కిలో మీటర్లు వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఒక పరిశ్రమ తనిఖీ చేసిన అధికారి మరో ప్రాంతానికి వెళ్లడానికే గంటల సమయం పడుతుంది.

నిబంధనల ఉల్లంఘనలు..

పలు రసాయన పరిశ్రమలు ద్రవ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో, మూసీ కాల్వలో పారబోస్తున్నారు. అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేయాల్సి ఉండగా.. అప్పుడప్పుడు స్థానికులే ట్యాంకర్లను పట్టుకొని అప్పగిస్తున్నారు. పారబోసిన వ్యర్థాల నమునాలను సేకరించి, ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాత అవి ఏ పరిశ్రమవో గుర్తించి చర్యలు కూడా తీసుకోవచ్చు. కానీ.. సరిపడా అధికారులు లేకపోవడం, రోజువారి ఫిర్యాదులకే సమయం గడిచిపోతుంది. దీని వలన పాత కేసులు మరుగునపడుతున్నాయి.

పరిశ్రమలు పెరుగుతున్నా..సుర్కంటి వెంకట్‌రెడ్డి, సామాజిక కార్యకర్త నల్గొండ జిల్లా పీసీబీ కార్యాలయం ఏర్పడినప్పుడు 30 పరిశ్రమలు ఉండేవి. ఇప్పుడు పరిశ్రమల సంఖ్య 900కు పెరిగింది. అధికారులు మాత్రం అప్పుడు, ఇప్పుడూ ఐదుగురే ఉన్నారు. పరిశ్రమల సంఖ్యకు అనుగుణంగా అధికారులను నియమించాలి.

# కార్పొరేట్ వాకిటకు..సర్కారు సౌరభం

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు సహకారం అందిస్తోంది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఏడు జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులకు ఇంటర్ విద్యను అభ్యసించేందుకు ఉచితంగా అవకాశం కల్పించింది. ఆసక్తిగల విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి పదో తరగతిలో సాధించిన జీపీఏ, రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుని రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపిక చేస్తారు. సంబంధిత కళాశాల ఫీజును ప్రభుత్వమే భరిస్తుంది. ఏటా విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో చదివే అవకాశాన్ని కల్పిస్తుండటంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఈ పథకం తోడ్పాటు అందిస్తుంది.

'పది' ఫలితాలు ఇలా..

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 40,281 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్ష రాయగా.. 38,292 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయి స్థానాలను పరిశీలిస్తే సూర్యాపేట 6 స్థానం, నల్గొండ 9, యాదాద్రి భువనగిరి 25వ స్థానం పొందాయి. గురుకులాల విషయానికి వస్తే... జ్యోతిబా ఫులే గురుకులాల్లో 99.69 శాతం ఉత్తీర్ణత సాధించగా 89 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. గిరిజన గురుకులాల్లో 98.87 శాతం ఉత్తీర్ణత సాధించగా 10 మంది విద్యార్థులకు పది జీపీఏ పొందారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.45 శాతం ఉత్తీర్ణత సాధిస్తే 19 మంది విద్యార్థులకు 10 జీపీఏ రావడం విశేషం.

7 జీపీఏ పైగా వచ్చినవారు అర్హులు..

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం నాలుగు వేల సీట్లను ప్రభుత్వం కేటాయించింది. పదోతరగతి పరీక్షల్లో 7 జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, కస్తూర్బా, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉచిత కార్పొరేట్ విద్య చదువుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులందరూ అర్హులే. విద్యార్థులు పదో తరగతిలో సాధించిన జీపీఏతో పాటు రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన వారికి కేటాయించిన కార్పొరేట్ కళాశాలల వివరాలతో కూడిన సమాచారం పంపిస్తారు. వారు అన్ని పత్రాలతో సదరు కళాశాలకు వెళ్లి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో నిర్ణీత గడువులోగా చేరాల్సి ఉంటుంది. నిరుపేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

దరఖాస్తు విధానం ఇలా..

మీసేవ కేంద్రాల ద్వారా టీఎస్ఈపాస్ పోర్టల్‌లో %htpps;///// telanganaepass.cgg.gov.in% అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి పూర్తి వివరాలు, పదో తరగతిలో సాధించిన జీపీఏ ధ్రువీకరణతో పాటు ఇతర పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో జత చేయాలి. నాలుగు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చదివిన పాఠశాలల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రంతో పాటు తల్లిదండ్రుల వార్షిక ఆదాయ పత్రాన్ని దరఖాస్తుతో సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు పైగా వార్షికాదాయం మించొద్దు. కుల, స్థానిక ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలి. దివ్యాంగులు తమ వైకల్యానికి సంబంధించిన ధ్రువపత్రం అందజేయాలి. ఆధార్‌కార్డు ప్రతిని విధిగా జతచేయాల్సి ఉంటుంది.అవకాశం సద్వినియోగ పరచుకోవాలి

# దేవుడా

హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలోని కొందరు ఆలయ అధికారుల తీరు ఆడింది ఆట...పాడింది పాటగా మారింది. ఆలయాలకు దాతలు ఇచ్చే విరాళాలు, ఖర్చులపై నిర్దిష్టమైన లెక్కలు చూపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖుల దర్శనాలు, పండగల సమయంలో ఖర్చులపై నిఘా లేకపోవడంతో అధికారులు ఇష్టానుసారం సున్నాలు చుట్టి జేబులు నింపుకొంటున్నారంటూ ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో దాతలు సమర్పించే కానుకలకు రక్షణ లేకుండా పోతోంది. ఆయా ఆలయ అధికారులపై ఫిర్యాదులొచ్చిన ప్రతిసారీ విచారణకు ఆదేశించామంటూ చెబుతున్న ఉన్నతాధికారులు నివేదికలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు.

రెజిమెంటల్‌బజార్‌లోని కాశీవిశ్వనాథ దేవాలయం (దర్జీగుడి)కి సంబంధించిన 65 బంగారు ఆభరణాలకు 106.007 గ్రా బంగారం ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులోనూ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలొచ్చాయి. ఉన్నతాధికారులు లాకర్ తెరిచి చూడగా 16 ఆభరణాలకు సంబంధించి 22.750గ్రా బంగారం మాత్రమే ఉన్నట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు నివేదిక ఇచ్చారు. అయితే అప్పటి ఈవో ఇచ్చిన నివేదికకు, రెవెన్యూ అధికారుల నివేదికకు పొంతన లేదు. స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా 500 చీరలను మాయం చేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

ఉజ్జయినీ మహాకాళీ దేవాలయంలో అమ్మవారి నగల అంశంలో సిబ్బంది చేతివాటంపై ఆరోపణలు వెల్లువెత్తగా విచారణకు ఆదేశించిన



దేవాదాయశాఖ ఇప్పటివరకు దీనిపై ఎలాంటి నివేదికను బయటపెట్టలేదు. భక్తులు సమర్పించిన బంగారు ఆభరణాలు, కానుకలను లెక్కగట్టి గుడి రిజిస్టర్‌లో నమోదు చేయాలి. తర్వాత ఈవోలకు అందజేయాలి. 2006 వరకు అమ్మవారికి సుమారు 5కిలోల 473గ్రాముల 200మిల్లీగ్రాముల బంగారు ఆభరణాలున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కానీ 2017లో ఓ ఈవో స్వాధీనం చేసుకున్న వాటి లెక్కలకు వ్యత్యాసం ఉందంటూ కొందరు ఆలయాల పరిరక్షణ సంస్థల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అప్పట్లో దాదాపు 140 బంగారు ఆభరణాలు (5కిలోల 473గ్రాముల 200 మిల్లీగ్రాములు) ఉండగా...2017లో చూపించిన లెక్కల ప్రకారం 76 ఆభరణాలకు (2కిలోల 132గ్రాములు 94 మిల్లీగ్రాములు) సంబంధించిన వివరాలు పొందుపరచలేదంటూ ఫిర్యాదులు అందడంతో దేవాదాయశాఖ విచారణకు ఆదేశించింది. ఈ విషయంపై తమ వద్ద అన్ని ఆధారాలున్నాయంటూ ఫిర్యాదీదారులు చెబుతున్నారు. అయితే విచారణ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా..నివేదికను బహిర్గతం చేయలేదు.

# మహానగరానికి గోదావరి భరోసా

హైదరాబాద్ : వేసవిలో నగరానికి గోదావరి జలాల భరోసా దక్కింది. వాస్తవానికి మే 1 నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అత్యవసర పంపింగ్‌తో నగరానికి నీటిని తరలించడానికి జలమండలి ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ...ఎల్లంపల్లిలో నీటి మట్టం తగినంత ఉండటంతో ఆ పరిస్థితి రాలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నీటి మట్టం 462 అడుగుల వరకు ఉంది. 455 అడుగులకు తగ్గినప్పుడు అత్యవసర పంపింగ్ అవసరం కానుంది. గోదావరి నుంచి నిత్యం నగరానికి 172 మిలియన్ గ్యాలన్లు తరలిస్తున్నారు. ఈ నెలకు ఒక టీఎంసీ వరకు జలాలు అవసరం అవుతాయి. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీటి మట్టం పరిగణలోకి తీసుకుంటే...ఇంకో రెండు నెలల వరకు ఎలాంటి అత్యవసర పంపింగ్ లేకుండానే నగరానికి నీటిని తరలించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే గోదావరి పరివాహక ప్రాంతంలో అడపాదడపా కురుస్తున్న వానలు, త్వరలో రుతుపవనాలు రానున్న దృష్ట్యా అత్యవసర పంపింగ్ అవసరమే ఉండక పోవచ్చునని అంచనా వేస్తున్నారు.

సాగర్ నుంచి మూడు దశల్లో..మరోవైపు నాగార్జునసాగర్‌లో అత్యవసర పంపింగ్ కొనసాగుతోంది. నగరానికి అవసరమయ్యే 270 ఎంజీడీల నీళ్లను మూడు దశల్లో నగరానికి తరలిస్తున్నారు. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా...ప్రస్తుతం 504 అడుగులకు చేరింది. నీటి మట్టం 510 అడుగులకు తగ్గినప్పటి నుంచే ఇక్కడ జలమండలి అత్యవసర పంపింగ్ ద్వారా నగరానికి నీటిని అందిస్తోంది. మరోవైపు జంటజలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ కొంతవరకు ఆదుకుంటున్నాయి భూగర్భ జలాలు అడుగంటడంతో ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. వచ్చే వేసవి నాటికి నగరంలో నీటి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

# కాపాడకపోతే కష్టమే

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలోని రూ.వేల కోట్ల విలువైన భూముల పరిరక్షణ సవాలుగా మారుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో లేఅవుట్ల కింద మార్చి ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఇంకా పలు చోట్ల వేల ఉన్నప్పటికీ వాటిని కాపాడుకోవడం కోసం సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో జవహర్‌నగర్ భూముల ఆక్రమణల వ్యవహారంలో ఓ కార్పొరేటర్ హస్తం ఉన్నట్లు తేలిన సంగతి తెలిసిందే. శంషాబాద్‌లోనూ హెచ్ఎండీఏకు చెందిన 50 ఎకరాలను ఓ వ్యక్తి ఆక్రమించడంతో ఏకంగా సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడాల్సి వచ్చింది. మియాపూర్‌లో హెచ్ఎండీఏ భూములను కొందరు ఆక్రమించి పక్కా ఇళ్లను సైతం నిర్మించారు. నగరం చుట్టుపక్కల హెచ్ఎండీఏ ల్యాండ్ బ్యాంకులో ఉన్న భూములకు చుట్టూ ఇనుప కంచెలు నిర్మించినప్పటికీ వాటిని తొలగించి మరీ ఆక్రమిస్తున్నారు. తొలుత షెడ్లు వేసి.. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో భూములు రూ.కోట్లు పలుకుతుండటంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఎలాగైనా తొలుత వాటిలో చిన్నపాటి షెడ్లు వేసి వాటిని వివాదాల్లోకి లాగుతున్నారు. కోర్టుల్లో కేసులు వేస్తూ ఆ భూములపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు. కొందరు ఆక్రమణదారులు ముఠాలుగా ఏర్పడి కబ్జాలకు తెగబడుతున్నారు.

# కొలతలు తీసుకోక.. దుస్తులు సరిపోక!



తాండూరు : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ఏటా ఉచితంగా ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నారు. అయితే వీటిని కుట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొలతలు తీసుకోకుండానే సరఫరా చేస్తున్నారు. వాటిని ధరిస్తున్న విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఏడాదిపాటు మన్నాల్సిన దుస్తులు మూడు నెలలకే చిరిగిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మధ్య పేద, ధనిక, కుల, మత తారతమ్యాలు లేకుండా అందరు సమానమన్న భావన కల్పించే ఉద్దేశంతో ఏటా ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తులను అందిస్తున్నారు. అందుకు అవసరమైన వస్త్రాన్ని టెస్కో ద్వారా జిల్లాలోని ఇరవై మండలాల ఎమ్మార్సీలకు చేరవేస్తున్నారు.

మహిళా సంఘాలకు ఇవ్వాలని చెప్పినా: యూడైస్‌లో పేర్కొన్న విద్యార్థుల సంఖ్య ప్రకారం నేరుగా పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల ద్వారా తరలిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీలు వస్త్రాన్ని స్థానిక దర్జీలకు లేదా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించి రెండు జతల దుస్తులను కుట్టించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తరగతుల వారీగా విద్యార్థుల కొలతలు సేకరించి వాటి ప్రకారం దుస్తులు కుట్టాలని సూచించింది. ఇందుకు రూ.100 చొప్పున కూలి చెల్లించేందుకు ఖరారు చేసింది. అయితే ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా హైదరాబాద్, జహీరాబాద్, సంగారెడ్డిలోని బడా దర్జీ సంస్థలకు అప్పగిస్తున్నారు. ఆయా సంస్థల వారు నేరుగా బడులకు వెళ్లి వస్త్రాన్ని తీసుకెళ్లి రెండుమూడు నెలలకు దుస్తులు అప్పగిస్తున్నారు.

తల్లిదండ్రులపై అదనపు భారం: కొలతలు లేకుండా దుస్తులు కుడుతుండగా కొందరు విద్యార్థులకు సరిపోలడం లేదు. చొక్కా, నిక్కరు వదులుగా మారడం, మరికొందరికి బిగుతుగా అవ్వడంతో వాటిని ధరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు తిరిగి సరిచేయించడంతో వారిపై అదనపు భారం పడుతోంది. కుట్లు సరిగ్గా లేకపోవడంతో పంపిణీ చేసిన రెండుమూడు నెలలకే దుస్తులు చిరిగిపోతున్నాయి. గత్యంతరంలేక వాటిని వాటిని ధరించే బడికి వస్తుండగా మరికొందరు ఇతర దుస్తులతో హాజరవుతున్నారు. సర్కారు వస్త్రాన్ని, కుట్టు కూలిని అందించినప్పటికి పేద విద్యార్థులకు ప్రయోజనం లేకుండాపోతోందని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం స్థానిక దర్జీలకు అప్పగిస్తే కొలత తీసుకునే వీలుంటుంది. సరిగా కుట్టకుంటే ప్రశ్నించేందుకు వీలుంటుంది. జూన్ 12న బడులు తెరుచుకోనుండగా విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులను పంపిణీ చేసేందుకు విద్యా శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో ఇలా

ప్రాథమిక బడులు: 764

ప్రాథమికోన్నత: 116

ఉన్నత : 174

విద్యార్థులు: 84,374

# ఈ'నామ్‌కే'వాస్తే!



తాండూరు: జిల్లాలో ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్( ఈనామ్)ఇంకా దేశ వ్యాప్తంగా విస్తరణ జరగలేదు. ఫలితంగా విపణుల్లో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. వివిధ రాష్ట్రాల విపణులకు అనుసంధానం జరిగితే, ఉత్పత్తులను వ్యాపారులు ఒకరికి తెలియకుండా ఒకరు ఆన్‌లైన్‌లో పోటీ పడి కొనుగోలు చేస్తారు. ఈ పరిణామం రైతులకు ఆర్థికంగా లాభిస్తుంది. మార్కెట్లకు కూడా రుసుం రూపంలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

2016లో ప్రారంభమైనా..: ఖరీఫ్ సీజన్‌కు ముందు 2016లో కేంద్ర ప్రభుత్వం ఈనామ్‌ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 615 వ్యవసాయ మార్కెట్లను దీని పరిధిలో చేర్చింది. ఇందులో జిల్లా నుంచి తాండూరు విపణిని చేర్చారు. దశల వారీగా వికారాబాద్, పరిగి విపణులను చేర్చారు. గేట్ ఎంట్రీ, లాట్ నంబరు కేటాయింపు, బిడ్డింగ్ వంటి ప్రక్రియ చేపట్టేందుకు కంప్యూటర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. విక్రయానికి తెచ్చిన ఉత్పత్తులను ఫ్లాట్ ఫారాలపై కుప్పగా పోయాలి. అధికారులు వాటి చిత్రాలు, వీడియోలు తీసి విపణులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దేశవ్యాప్త సర్వర్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. నిర్ణీత సమయంలో కంప్యూటర్‌లో వీక్షించే వ్యాపారులు సరకును ఎంతకు కొనుగోలు చేస్తున్నారనే వివరాలను కోట్ చేస్తారు. బిడ్డింగ్ అనంతరం జరిగే డిక్లరేషన్‌లో ఏ వ్యాపారి ఎంత ధరకు ఏ సరకును కొనుగోలు చేశారనే విషయం తెలుస్తుంది. ఎక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులకు అధికారులు వారు సూచించిన చిరునామాకు పంపిస్తారు.

వ్యాపారుల పోటీతో: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పోటీ పడడం వల్ల రైతులు తాము ఆశించిన ధర కంటే ఎక్కువ ధర వస్తుంది. ఇదే సమయంలో వ్యాపారులు కొనుగోలు చేసిన ఉత్పత్తుల విలువలో ప్రతి రూ.100కు 1శాతం చొప్పున ఎక్కువ ఆదాయం విపణికి సమకూరుతుంది. అయితే విపణులను జాతీయ సర్వర్‌కు అనుసంధానం చేయకపోవడంతో, విపణుల పరిధిలోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరకు కొన్న వ్యాపారులు, ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి లబ్ధిపొందుతున్నారు.

రూ.1200 కోట్లకు పైగా ఉత్పత్తుల విక్రయాలు: జిల్లాలోని పది వ్యవసాయ విపణుల పరిధిలో రైతులు ఏటా రూ.1200 కోట్లకు పైగా వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇందులో కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్నలు, వేరుసెనగ, శనగలు, పసుపు, వాము, సోయాబిన్, జొన్నలు, కుసుమ వంటి తదితర ఉత్పత్తులు ఉంటున్నాయి. విక్రయమైన ఉత్పత్తుల విలువలో రూ.800 కోట్లు తాండూరు, పరిగి, వికారాబాద్ విపణుల నుంచే ఉంటున్నాయి. రూ.100కు 1 శాతం చొప్పున మూడింటికి కలిపి రూ.8కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అయితే ఈ-నామ్ పక్కాగా అమలైతే ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఉంది. ఈ-నామ్ విస్తరణ ఉన్నత స్థాయి అధికారులు తీసుకోవాల్సిన నిర్ణయమని తాండూరు వ్యవసాయ విపణి ప్రత్యేక శ్రేణి కార్యదర్శి రాజేశ్వరీ తెలిపారు.

# జీహెచ్ఎంసీని ఎలా గట్టెక్కిస్తారు?



హైదరాబాద్: అప్పుల్లో కూరుకుపోయిన జీహెచ్ఎంసీని ఎలా గట్టెక్కించాలనే అంశమై పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, వేర్వేరు విభాగాల పనితీరు, ఏడాది కార్యాచరణ, వర్షాకాలంలో ముంపును ఎలా ఎదుర్కోవాలి, ట్రాఫిక్ సమస్య, రోడ్ల విస్తరణకు గల ఆటంకాలు, పరిష్కారం, ప్రజారోగ్యం, దోమల సమస్య, క్రీడలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద క్రీడా వసతుల పెంపు, ఇతరత్రా అంశాలపై ఆయన బల్దియా కమిషనర్ రోనాల్డ్‌రాస్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లతో కలిసి సచివాలయంలో సుదీర్ఘంగా చర్చించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆర్థిక పరిస్థితి మెరుగుపడేదెలా..?

జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితిని ఏ రకంగా మెరుగుపరుచుకుంటామనే అంశమై అధికారులు దానకిశోర్‌కు నివేదిక ఇచ్చారు. "నగరంలో 2007లో చివరిసారి ఆస్తిపన్ను విలువను పెంచారు. పునర్ మదింపు ద్వారా ఏటా కొంత ఆదాయం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాదికి రూ.2,500 కోట్ల వసూలును లక్ష్యంగా పెట్టుకున్నాం. పన్ను విలువను పెంచితే ఆదాయం మరింత పెరుగుతుంది. ట్రేడ్ లైసెన్సుల రుసుము, ప్రకటనల విధానాల్లో మార్పుల ద్వారా మరికొన్ని నిధులను సమకూర్చుకోవచ్చు."అని జీహెచ్ఎంసీ అధికారులు వివరించారు.

ఇంజినీరింగ్ పనులపై..

ఎస్సార్డీపీ, ఎస్ఎన్‌డీపీ తదితర ప్రాజెక్టుల్లో భాగంగా చేపట్టిన పనులు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నాయి, పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ఎన్ని నిధులు అవసరమో ఇంజినీర్లు దానికిశోర్‌కు తెలిపారు. అనంతరం కూడళ్ల సుందరీకరణ, రోడ్ల విస్తరణపై దానకిశోర్ వారికి సూచనలు చేశారు. రోడ్ల విస్తరణకు విద్యుత్తు స్తంభాలు ఎక్కడెక్కడ అడ్డుగా ఉన్నాయి, ఇతర సమస్యలపై ట్రాఫిక్ పోలీసులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని, పోలీసుల సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

నగరంలోని క్రీడా వసతులను మెరుగుపరచాలని, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్సులను దత్తత తీసుకునేందుకు సంస్థలను ఆహ్వానించాలని, ముందుకొచ్చిన సంస్థలతో మంచి ఫలితాలు రాబట్టాలని దానకిశోర్ బల్దియా కమిషనర్‌కు సూచించారు. పార్కులు, పచ్చదనం, డ్వాక్రా సంఘాలు, తదితర అంశాలపై ఆయన సమావేశంలో చర్చించారు.

# లక్ష ప్రయాణికులు లక్ష్యం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్‌పై మరోసారి చర్చ మొదలైంది. ఆర్టీసీలో మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించిన తర్వాత మెట్రోలో 40 వేల మంది ప్రయాణికులు తగ్గారని ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో సగటున నిత్యం 4.4 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారు. ఈ సంఖ్య 5.5 లక్షలకు చేరితే మెట్రో ప్రాజెక్ట్ ఆర్థికంగా మెరుగవుతుంది. మరో లక్షకుపైగా ప్రయాణికుల సంఖ్య పెరగాల్సి ఉందని ఎల్‌అండ్‌టీ వర్గాలు పేర్కొన్నాయి.

సర్కార్ ఇచ్చింది రూ.900 కోట్లు : కొవిడ్ సమయంలో మెట్రో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిందని.. సాఫ్ట్‌లోన్ ఇచ్చి ఆదుకోవాలని సర్కార్‌ను ఎల్‌అండ్‌టీ కోరింది. అప్పటి ప్రభుత్వం రూ.3 వేల కోట్ల వడ్డీ రహిత దీర్ఘకాల రుణం ఇస్తామని హామీ ఇచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.900 కోట్లు వచ్చాయని.. మరో రూ.2100 కోట్లు రావాల్సి ఉందని ఎల్‌అండ్‌టీ సీఎఫ్‌వో ఆర్.శంకర్ రామణ్ తెలిపారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తమకు కేటాయించిన భూములను మానిటైజేషన్ చేసేందుకు సర్కారు అనుమతిచ్చిందని.. రాయదుర్గంలోని భూమిని



గత ఆర్థిక సంవత్సరంలో మానిటైజ్ చేశామని చెప్పారు.

రెండేళ్లు పట్టొచ్చు..: ప్రయాణికుల సంఖ్య 6 లక్షలకు చేరుకుని ప్రాజెక్ట్ ఆకర్షణీయంగా మారాలంటే ఒకటి, రెండేళ్లు పడుతుందని శంకర్ రామణ్ అన్నారు. 12 శాతం రాబడి వస్తే ఎవరైనా పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారన్నారు. అందుకు 18-24 నెలలు పడుతుందన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఈ లక్ష్యానికి చేరుకుంటామా.. లేదా.. అనే ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు.


# అన్నదాతపై ప్రకృతి ప్రకోపం

సిరిసిల్ల : యాసంగి వరి పంట చేతికొచ్చినప్పటి నుంచి అన్నదాతపై ప్రకృతి పగబట్టినట్లు ఉంది. అకాల వర్షాలతో వారం రోజులుగా కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా సాగుతుంటే, పక్క జిల్లాకు కేటాయించిన ధాన్యం దింపుకోవడంలో రోజుల తరబడి జాప్యం నెలకొంటుంది. వెరసి కొనుగోళ్ల చివరి దశలోనూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కుప్పగా పోసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పుదామన్నా మార్కెటింగ్‌శాఖ తూకం వేసి బస్తాలకే ఇస్తున్నారు. తూకం వేయని వాటికి ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. అధికార యంత్రాంగం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెబుతున్నా సరైన వసతులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. ధాన్యం సేకరణ పూర్తయితే ఈనెల 25 నుంచి రోహిణి కార్తె మొదలవుతుంది. వానాకాలం సీజన్ ప్రారంభమవుతుంది. వచ్చే సీజన్‌కు దుక్కులు దున్ని, తిరిగి నారుమళ్లు సిద్ధం చేసుకునేందుకు సిద్ధం కావాలి.

జిల్లాలో యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణకు 259 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇప్పటి వరకు 55 కేంద్రాల్లో తూకాలు పూర్తయ్యాయి. 1.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇంకా కేంద్రాల్లో 50 వేల మెట్రిక్ టన్నుల మేరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 29,262 మంది రైతులకు రూ.321.30 కోట్ల చెల్లింపులు జరిగాయి. తూకాలు పూర్తయిన వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రతి రైతు నుంచి ఈసారి కొత్తగా ఐరిస్ నమోదు చేసేందుకు పరికరాలను పంపిణీ చేశారు. కానీ ఈ ప్రక్రియను చాలా కేంద్రాల్లో పక్కన పెట్టారు. చాలా చోట్ల ట్యాబ్‌లో నమోదు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఒక్కో లారీలో ఇద్దరు ముగ్గురు అంతకన్నా ఎక్కువ రైతులకు చెందిన ధాన్యం ఉండటంతో వారందరి ఐరిస్ తీసుకునే క్రమంలో ఏ ఒక్కరిది నమోదు కాకున్నా తిరిగి మొదటి నుంచి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా పలు ఇబ్బందులతో నిర్వాహకులు ఓటీపీ పద్ధతికే మొగ్గు చూపుతున్నారు.

మిల్లుల్లో పేరుకుపోయిన నిల్వలు

జిల్లాలోని మిల్లుల సామర్థ్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు. ఇదీకాక మొన్నటి వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యం సీఎంఆర్ పదిశాతం కూడా పూర్తవలేదు. అలాగే యాసంగి ధాన్యం వేలంలో సగానికిపైగా అలానే ఉన్నాయి. ఈ యాసంగి సీజన్‌కు ఇప్పటికే 1.97 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలు



ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయాయి. ఉన్నవాటిని భద్రపరిచేందుకే చాలా మిల్లుల్లో స్థలం సరిపోవడం లేదు. జిల్లాలోని ధాన్యాన్ని కరీంనగర్‌లోని మిల్లులకు 40 వేల మెట్రిక్ టన్నులు కేటాయించారు. అక్కడికి పంపిన లారీల్లో ధాన్యం దింపుకోవడంలో రోజుల తరబడి ఆలస్యమవుతోంది. దీని ప్రభావం జిల్లాలోని కేంద్రాల్లో తూకం, తరలింపులపైన చూపుతోంది. కరీంనగర్‌లో జాప్యం జరుగుతుండటంతో జిల్లా అధికారులు అదనపు కేటాయింపులకు సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లోని మిల్లులకు కేటాయించాలని రాష్ట్ర అధికారులను కోరుతూ లేఖలు పంపారు.

చివరి దశలో కొనుగోళ్ల ప్రక్రియ

– జితేంద్రప్రసాద్, పౌర సరఫరాలశాఖ మేనేజర్

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశలో ఉంది. పక్క జిల్లా మిల్లులకు కేటాయించిన ధాన్యం దిగుమతిలో కాస్త జాప్యం జరుగుతోంది. దీనిని నివారించి జిల్లా రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం. ఆన్‌లైన్ నమోదులోనూ సాంకేతిక లోపాలు సవరించుకుంటూ ముందుకెళ్తున్నాం. కూడా త్వరగానే జరుగుతున్నాయి.




## ఏసీపీ ఇంట్లో ఏసీబీ రైడ్స్ కలకలం.. వెలుగులోకి విస్తుపోయే విషయాలు..!

హైదరాబాద్: నగరంలోని పలుచోట్ల ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహిస్తున్నారు. సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో ఆయనకు సంబంధించిన పది ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. అత్యంత సంచలనం కలిగించిన సాహితీ ఇన్‌ఫ్రా కేసును ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ప్రత్యేక చీఫ్ అధికారిగా ఆయన ఉన్నారు. పెద్ద ఎత్తున సాహితీ సంస్థ మోసాలకు పాల్పడిన విషయం తెలిసిందే.

**బీజేపీ నేతకు బెదిరింపులు :** సీసీఎస్ ఏసీపీ ఉమా మహేశ్వరరావు ఇంట్లో ఎనిమిది గంటలుగా ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. గతంలో ఇబ్రహీంపట్నం ఏసీపీగా ఉన్న సమయంలో ఉమా మహేశ్వరరావుపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. భూ వివాదాల్లో తలదూర్చి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. సాహితీ ఇన్ ఫ్రా కేసులో నిందితులనుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. నిందితులకు సపోర్ట్ చేసి బాధితులకు అన్యాయం చేస్తున్నాడని పలు ఫిర్యాదులు అందాయి. సోదాల్లో భాగంగా ఇప్పటికే పెద్ద మొత్తంలో నగదు, బంగారాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో భాగంగా ఉమా మహేశ్వరరావు బ్యాంకు లాకర్లను అధికారులు గుర్తించారు. గతంలో బీజేపీ నేత చరణ్ చౌదరిని బెదిరించి , టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధకిషన్ రావు సహాయంతో రూ.30 లక్షలు నగదుని చరణ్ స్నేహితులు ద్వారా ఏసీపీ ఉమామహేశ్వరరావు నగదు బదిలీ చేయించుకున్నారు. ఏక కాలంలో ఎనిమిది చోట్ల..ఏపీ , తెలంగాణాలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. సోదాల అనంతరం ఏసీబీ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించనున్నారు. ఫ్రీలాచింగ్ ఆఫర్లతో బాధితుల నుంచి భారీగా సొమ్ములను వసూలు చేసింది. సుమారుగా రూ.1800 కోట్ల వరకు ఈ సంస్థ మోసాలకు పాల్పడిందని సీసీఎస్ అధికారులు నిగ్గు తేల్చారు. సాహితీ సంస్థ కేసులోనూ ఉమామహేశ్వరరావు అవకతవకలకు పాల్పడినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఆదాయానికి మించి పెద్ద ఎత్తున ఆస్తులను కూడబెట్టారని ఏసీబీకి ఉమామహేశ్వరరావుపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో నిఘా ఉంచిన ఏసీపీ అధికారులు ప్రస్తుతం సోదాలు కొనసాగిస్తున్నారు. ఈ సోదాలు కలకలం రేపుతున్నాయి.

**ఆ రెండు అంశాలపై ఏసీబీ దృష్టి :** సాహితీ ఇన్‌ఫ్రా బాధితులు 2500కు పైగా ఉన్నారు. బాధితుల నుంచి ఈ సంస్థ పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడింది. ఫ్రీలాచింగ్ పేరుతో పూర్తిస్థాయిలో భవనాలు నిర్మించి ఇస్తామని సదరు సంస్థ బాధితులను మోసం చేసి పలు ప్రాజెక్టుల్లోకి నగదును మళ్లించింది. ఈ సంస్థపై సీసీఎస్‌లో కేసు నమోదైంది. ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఉమామహేశ్వరరావు చీఫ్‌గా ఉన్నారు. ఆయనను నియమించిన తర్వాత బాధితులకు ఎక్కడ న్యాయం జరుగలేదు. సాహితీ ఇన్ ఫ్రా కేసు, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఈ రెండు అంశాలతో ఏసీబీ అధికారులు గంటసేపటి నుంచి సోదాలు చేస్తున్నారు.

**10 టీం లతో పలు ప్రాంతాల్లో సోదాలు :** ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడిన అధికారులు పలు ప్రాంతాల్లో రైడ్స్ చేస్తున్నారు. ముందుగా అశోక్ నగర్‌లోని ఏసీపీ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు. ఈ సోదాల్లో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏసీపీ బంధువులు, స్నేహితులు, సన్నిహితంగా ఉండే వారి నివాసాల్లో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. పది టీమ్‌లుగా ఏర్పడి పలు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. అత్యంత వివాదాస్పద అధికారిగా ఉమామహేశ్వరరావుకు పేరుంది. ఆయన పనిచేసిన పలు ప్రాంతాల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈయనపై అవినీతి ఆరోపణలు ఉండటంతో పాటు మహిళలను అసభ్యంగా దుర్భాషలు ఆడతారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.




## జయ జయహే తెలంగాణ గీతానికి.. కీరవాణి మ్యూజిక్... విడుదల ఎప్పుడంటే..?

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీతంపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. జూన్ 2వ తేదీన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో ఈ గీతాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతానికి కొన్ని మార్పులు చేశారు. ఒకటిన్నర నిమిషం నిడివిలో ఈ గీతం సిద్ధం అవుతోంది. సినీ సంగీత దర్శకుడు కీరవాణితో ఈ పాటను రేవంత్ ప్రభుత్వం కంపోజింగ్ చేయించింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న.. ఇంతవరకు రాష్ట్రం గీతం లేకుండేది. గతంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది.

**రాష్ట్ర గీతంలో మార్పులు :** తెలంగాణకు ప్రత్యేక రాష్ట్ర గీతం ఉండాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గతంలో అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతాన్ని అమోదిస్తూ కేబినెట్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే తెలంగాణ ఉద్యమం కంటే ముందు ఈ గీతాన్ని రచించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కొన్ని మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే ఆ గీతం రాసిన అందెశ్రీకి కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం సూచించింది. అందులో భాగంగా అందెశ్రీ ఈ గీతంలో మార్పులు చేసి ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం అమోదముద్ర వేసింది. ఆ గీతాన్ని సినీ సంగీత దర్శకుడు కీరవాణితో కంపోజింగ్ చేశారు. జూన్2న రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో.. ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుంది.

**సీఎం రేవంత్ కితాబు..** ఈ కార్యక్రమానికి సోనియా గాంధీని చీఫ్ గెస్ట్‌గా పిలవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. నిన్న నిర్వహించిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సోనియాగాంధీ చేతుల మీదుగా తెలంగాణ గీతాన్ని విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. కాసేపటి క్రితమే అందెశ్రీ, కీరవాణి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణ గీతాన్ని వినిపించారు. ఈ గీతం చాలాబాగుందని రేవంత్ కితాబిచ్చారు. అయిదారు చరణాలతో పూర్తి గీతం ఉంటుంది. ఇందులో ఉన్నటువంటి రెండు చరణాలను మాత్రమే రాష్ట్రం గీతంగా ప్రకటించారు. ఈ రెండు చరణాల్లో తెలంగాణ అవిర్భావం ఎలా జరిగింది, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుకొచ్చేలా రాష్ట్ర గీతం ఉండనున్నది. జూన్2న రాష్ట్ర ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక సమావేశాల సమయాల్లో తెలంగాణ గీతాన్ని ఆలపించే అవకాశం ఉంది.

## కొత్త బ్రాండ్ల మద్యం కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదు: మంత్రి జూపల్లి



హైదరాబాద్: తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు తీసుకొస్తున్నామనేది దుష్ప్రచారమేనని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొత్త బ్రాండ్ల కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదని, అసలు పరిశీలనే జరగలేదని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "దొంగే దొంగ అన్నట్లుగా భారాస నేతల మాటలు ఉన్నాయి. గత ప్రభుత్వం చాలా శాఖల్లో బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. రైతు భరోసాకు సంబంధించి రూ.6వేల కోట్లకు పైగా చెల్లింపులు మా ప్రభుత్వంలో జరిగాయి. ఈ నెలలోనే రూ.370 కోట్ల చెల్లింపులు చేశాం. మద్యం కొరత ఉంటే ప్రభుత్వానికే నష్టం.. ప్రజలకు కాదు. బ్లాకులో అమ్మిన ఘటనలపై ఎక్సైజ్ శాఖ కేసులు నమోదు చేసింది. టానిక్‌లకు గత ప్రభుత్వం ఇచ్చిన పన్ను మినహాయింపులను రద్దు చేశాం. తయారీ యూనిట్ల వద్ద ఎలాంటి అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులు నిరంతరం పరిశీలిస్తున్నారు. గతంలో పైరవీలు, ముడుపులు ఉంటే తప్ప ఉద్యోగుల బదిలీలు జరిగేవి కావు. ఇప్పుడు అలాంటివేవీ లేకుండానే పోర్టల్ ద్వారా బదిలీలు జరుగుతున్నాయి. తప్పుడు రాతలు రాసిన పత్రికపై పరువునష్టం దావా వేస్తాం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎక్సైజ్‌శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం" అని జూపల్లి తెలిపారు.

## సన్నం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం సరికాదు




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో బోనస్ అంశం తీవ్ర దుమారం రేపుతోంది. సన్నం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో తేనె తుట్టెను కదిలించినట్టు అయ్యింది. ఇదే అంశంపై విపక్ష బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. మేనిఫెస్టోలో వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని హరీశ్ రావు (%ఝఖీఅంష్ట్ర ఝశీ%) గుర్తుచేశారు. ఇప్పుడు మాట మార్చి సన్న వడ్లకు మాత్రమే ఇస్తాననడం సరికాదని గుర్తుచేశారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండుతుంది. అన్నింటికి బోనస్ ఇవ్వాలంటే రూ.6 వేల కోట్ల భారం పడుతుంది. అందుకోసం సన్నం వడ్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని హరీశ్ రావు విమర్శించారు. ఇలా చేస్తే రూ.400 కోట్ల మాత్రమే ఖర్చవుతుందని వివరించారు.

**కారణమిదేనా..?** యాసంగిలో రైతులు సన్నం వడ్లు పండించరని హరీశ్ రావు గుర్తుచేశారు. పండించని వడ్లకు బోనస్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బోనస్ ఇవ్వకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త కుట్రకు తెరతీసిందని విమర్శించారు. రైతు భరోసా కింద ఎకరాకు ప్రభుత్వం రూ.2500 ఇవ్వాల్సి ఉందన్నారు. వానాకాలానికి సంబంధించి ఎకరానికి 15 వేల రైతు భరోసాతోపాటు యాసంగి బకాయిలు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

దొడ్డు వడ్లు కొంటారా? కొనరా? కొంటె ఎప్పటి నుంచి కొంటారో చెప్పాలని సూటిగా అడిగారు. దొడ్డు వడ్లకు బోనస్ ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టమని తేల్చి చెప్పారు. ఇతర పంటల కొనుగోలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్లు కొనడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం వడ్లు కొనకపోవడం వల్ల రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## అబద్ధాలు చెప్పడం భారాస నేతలకు అలవాటు: భట్టి విక్రమార్క



హైదరాబాద్: వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అబద్ధాలు చెప్పడం భారాస నేతలకు అలవాటన్నారు. 15 రోజుల ముందుగానే ధాన్యం కొంటున్నట్లు వివరించారు. గతం కంటే ఎక్కువగా 7,215 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం కొనలేదని చెప్పారు. "చివరి గింజ వరకూ కొంటాం.. రైతులు ఆందోళన చెందవద్దు. తడిచిన, మొలకెత్తిన ధాన్యానికి కూడా ఎంఎస్‌పీ ఇచ్చి తీసుకుంటాం. ధాన్యం రైతులకు మూడు రోజుల్లోనే డబ్బు అందిస్తున్నాం. వర్షసూచనపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలి. రూ.500 బోనస్ సన్న ధాన్యానికే అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. రూ.500 బోనస్ అనేది సన్న ధాన్యం నుంచి మొదలుపెట్టాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## ఇంత మోసమా? కాంగ్రెస్‌పై కేటీఆర్ సంచలన ట్వీట్..



హైదరాబాద్, మే 21: వరిపంటకు బోనస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం నాడు ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసంపై షాకింగ్ పోస్ట్ పెట్టారు. ఇది ప్రజా పాలన కాదని.. రైతు వ్యతిరేక పాలన అని విమర్శలు గుప్పించారు కేటీఆర్. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**కేసీఆర్ పోస్ట్ సారాంశం..** 'ఇది కపట కాంగ్రెస్ మార్కు మోసం.. దగా.. నయవంచన.. గ్యారెంటీ కార్డులో.. "వరిపంటకు" రూ.500 బోనస్ అని ప్రకటించి.. ఇప్పుడు "సన్న వడ్లకు మాత్రమే" అని సన్నాయి నొక్కులు నొక్కుతారా ?? ప్రచారంలో ప్రతి గింజకు అని ఊదరగొట్టి.. ప్రభుత్వంలోకి రాగానే చేతులెత్తేస్తారా ?? ఇది ప్రజా పాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన. నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారు.. కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారు.. కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారు. ప్రతి ఏటా రైతులు, కౌలు రైతులకు రూ. 15 వేలు రైతుభరోసా అన్నారు .. ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12000 వేలు అన్నారు.. వేయలేదు. ప్రతి రైతుకు డిసెంబర్ 9నే..రెండు లక్షల రుణమాఫీ అన్నారు.. చేయలేదు. నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయటపెట్టారు.' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు కేటీఆర్.

## ఉత్తరాదిలోనే కాదు.. దక్షిణాదిలోనూ మోదీ వేవ్..



ఢిల్లీ: ప్రస్తుతం తెలంగాణలో ఎంపీ ఎన్నికలు ముగిసినందున బీజేపీ, కాంగ్రెస్ నేతలంతా ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ పార్టీ అధినేతల తరుపున పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రస్తుతం బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తర భారత దేశంలోనే కాదు దక్షిణ భారత దేశంలోనూ ప్రధాని మోదీ వేవ్ కనిపిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇప్పుడు మోదీ వేవ్ కనిపిస్తోందని.. మోదీ కోసం ఓటు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బీజేపీపై దుష్ప్రచారం చేసిందన్నారు. లిక్కర్ స్కాం, కవిత అరెస్టులపై కాంగ్రెస్ తెలంగాణలో ఒకలా మాట్లాడిందని కొండా విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఢిల్లీలో మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్ సపోర్ట్ చేస్తోందని తెలిపారు. లిక్కర్ స్కాం విషయంలో కాంగ్రెస్ తెలంగాణలో ఒకలా... ఢిల్లీలో ఒకలా మాట్లాడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే కన్ఫ్యూజ్ పార్టీ అని కొండా విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660